క్లుప్తంగా

ఘనంగా మోటారు మెకానిక్స్ డే



సామర్లకోటలో మెకానిక్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్న మెకానిక్‌లు

సామర్లకోట: శ్రీలక్ష్మీ గణపతి స్కూటర్ అండ్ మోటారు సైకిలు రిపేరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ మెకానిక్ డేను ఘనంగా నిర్వహించారు. మోటారు సైకిళ్ల సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోటారు మెకానిక్‌లందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించొచ్చని యూనియన్ కార్యదర్శి ఎ.సాంబశివ అన్నారు. సీనియర్ మెకానిక్ తోట సత్తిరాజు అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉండటంతో ఆయనను సత్కరించి యూనియన్ నుంచి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎండీ హనీఫ్, ఉపాధ్యక్షుడు ఐ.రాము, సహాయ కార్యదర్శి తణుకు శ్రీను, కోశాధికారి ఎస్.శ్రీను పాల్గొన్నారు.

9న నూకాలమ్మకు శాకంబరి అలంకరణ

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారిని ఆషాఢ మాసంను పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీ ఆదివారం శాకంబరిగా అలంకరించనున్నట్లు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శాకంబరి అలంకరణను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ



ప్రభాకర శర్మ

పెద్దాపురం: పెద్దాపురం మండల విద్యాశాఖాధికారిగా ఇ.ప్రభాకర శర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన ఎంఈఓ సత్యనారాయణ బిక్కవోలుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో శర్మ బదిలీపై వచ్చారు. తుని హైస్కూల్ హెచ్ఎంగా ఉన్న శర్మ పదోన్నతిపై పెద్దాపురం ఎంఈఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

రైతు కూలీల ధర్నా



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో సీలింగ్ భూములను పెత్తందారులకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మడికి సత్యం, కుంచే అంజిబాబు మాట్లాడుతూ 20 ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూముల్లో హెచ్చరిక బోర్డులు తొలగించి తమకే పట్టాలివ్వాలన్నారు.అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేదులూరి లక్ష్మి, నారాయణమూర్తి, గోను పాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐసీసీ సభ్యుడు ఓలేటి మృతి



రాయభాస్కరరావు (ఫైల్)

కొత్తపల్లి: వాకతిప్ప గ్రామానికి చెందిన ఏఐసీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు ఓలేటి రాయభాస్కర రావు (65) గుండెపోటుతో సోమవారం తెల్లవారు జామున స్వగృహంలో మృతి చెందారు. గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా, పిఠాపురం మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా పదవులు చేపట్టారు. రాయభాస్కర రావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఓలేటి భౌతికకాయాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.పాండురంగారావు, పీసీసీ సభ్యుడు మేడిది శ్రీనివాసరావు, జి.శ్రీనివాస రావు, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పులగల రాజుతో పాటు పలువురు నాయకులు సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిందితుడి అరెస్ట్



మోటార్ సైకిళ్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొత్తపల్లి: జిల్లాలోని పలుచోట్ల మోటార్ సైకిళ్లు, సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడిన ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. కాకినాడకు చెందిన బీర దుర్గావెంకటేష్ మండలంలోని మూలపేటలో ఆదివారం రాత్రి కిళ్లీ కొట్టును బద్దలు కొట్టి సెల్‌ఫోన్లు దొంగతనానికి పాల్పడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి పలు ప్రాంతాల్లో దొంగిలించిన మూడు మోటార్ సైకిళ్లు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై రామలింగేశ్వరరావు తెలిపారు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఉన్నత విద్యకు మార్గం సుగమం

- హైస్కూళ్ల అప్‌గ్రేడేషన్‌తో బాలికలకు చేరువైన విద్య
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



మహిళా జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన చంద్రమాంపల్లి హైస్కూలు

పెద్దాపురం: ప్రభుత్వం బాలికల ఉన్నత విద్యకు మార్గం సుగమం చేసింది. పదో తరగతి తరువాత బాలికల డ్రాప్‌అవుట్స్‌ను అరికట్టేందుకు ప్రతి మండలానికి ఒక బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేశారు. కళాశాల విద్య చేరువ కావడం విద్యార్థినులకు ఎంతో మేలు చేసే నిర్ణయమని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏటిపట్టుకు ప్రధాన కేంద్రమైన చంద్రమాంపల్లి హైస్కూలును అప్‌గ్రేడ్ చేసి బాలికల జూనియర్ కళాశాల నిర్వహించేందుకు గతేడాది అడ్మిషన్లు ప్రారంభించారు. పాఠశాల పరిధిలోని పులిమేరు, దివిలి, తాటిపర్తి, తిరుపతి, మర్లావ, కాండ్రకోట, ఉలిమేశ్వరం, సిరివాడ, గుడివాడ, గోరింట, వడ్లమూరు, పిఠాపురం మండలం విరవ, విరవాడ, కిర్లంపూడి మండలం రాజుపాలెం, ముక్కోల్లు గ్రామాల విద్యార్థినులంతా ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ కళాశాల చేరువలో ఉంటుంది.

దీంతో ఆయా గ్రామాల విద్యార్థినులంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏటిపట్టు గ్రామాల విద్యార్థినులకు వరం

ప్రతి మండలానికి ఒక్కో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంతో పెద్దాపురం నియోజకవర్గానికి రెండు కళాశాలలు మంజూరయ్యాయి. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి హైస్కూలుతో పాటు సామర్లకోట పట్టణంలో బ్రౌన్‌పేటలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను సైతం మహిళా జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఏటిపట్టు గ్రామాల విద్యార్థినులకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం ఓ వరమనే చెప్పుకోవాలి. ఇంతకాలం ఉన్నత విద్య కోసం ప్రభుత్వ కళాశాలలకు వెళ్లాలంటే సామర్లకోట, పెద్దాపురం, కాకినాడకు వెళ్లాల్సి వచ్చేది. ఇక నుంచి ఆ తిప్పలు పడాల్సిన అవసరం లేదు. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలో నిర్వహించనున్న మహిళా జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో 40 మంది, బైపీసీ గ్రూపులో 40 మంది విద్యార్థినులకు మాత్రమే అడ్మిషన్లు ఇవ్వనున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం అనేక జెడ్పీ హైస్కూళ్లను బాలికల జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. దీంట్లో భాగంగా చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు మహిళా జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఈ ప్రాంత విద్యార్థినులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డి.శ్రీవల్లి, ప్రధానోపాధ్యాయురాలు, చంద్రమాంపల్లి హైస్కూలు

దగ్గరలోనే ఉన్నత విద్య



చంద్రమాంపల్లిలో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటుతో పెద్దాపురం, పిఠాపురం, కిర్లంపూడి మండలాలకు చెందిన సుమారు 20 గ్రామాలకు చెందిన విద్యార్థినులకు మేలు జరుగుతుంది. ఉన్నత విద్య కోసం ఎక్కడికో వెళ్లాల్సిన పని లేకుండా దగ్గరలోనే కళాశాలలో చదువుకోవచ్చు.

– గోపు మురళి, గ్రామ ఉప సర్పంచ్, తాటిపర్తి, పెద్దాపురం మండలం

ప్రజావసరాలు తీర్చేందుకే జగనన్న సురక్ష

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



చదలాడలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు



సామర్లకోటలో జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులు



ఉప్పాడ సచివాలయంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

పెద్దాపురం: ప్రజావసరాలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని 2వ సచివాలయం సత్తెమ్మకాలనీ, మండలంలోని చదలాడ గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో ఎటువంటి రుసుము లేకుండా జగనన్న సురక్ష ద్వారా సేవలందిస్తున్నామన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఎంపీపీ పెండే సత్యవతి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కనకాల మహాలక్ష్మి, కమిషనర్ జంపా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీబీ దేవంలో..

సామర్లకోట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం పీబీ దేవం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హత ఉండి సంక్షేమానికి దూరమైనవారిని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలను అందజేయడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం అర్హులైన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉపసర్పంచ్ మలకల సత్య, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ధ్రువపత్రాలు

సామర్లకోట: అవసరమైన సర్టిఫికెట్లు ప్రజల వద్దకే తీసుకొచ్చి ఇచ్చే మహోన్నతమైన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టడం ఎంతో ఆనందంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక బ్రౌన్‌పేట ఒకటో సచివాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సోమవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్‌చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు పాలిక కుసుమ, మత్రిశేషారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొత్తపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మండల ప్రత్యేక అధికారి పుష్పామణి అన్నారు. ఉప్పాడ గ్రామ సచివాలయం-1లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేశారన్నారు. ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే అందజేస్తున్నారన్నారు. సర్టిఫికెట్లు మంజూరు చేయడమే కాకుండా సమస్యలను పరిష్కరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎంపీడీఓ అబ్రహం లింకన్, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం



పేదలకు బిర్యానీ పొట్లాలు అందజేస్తున్న సుదీప్



సామర్లకోటలో మాట్లాడుతున్న క్రైస్తవ సంఘ నాయకులు

పెద్దాపురం: భారతదేశానికి క్రీస్తు సువార్తను మొదట అందించిన హతసాక్షి థామస్ జ్ఞాపకార్థం నిర్వహించే భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన సోమవారం పెద్దాపురంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నంగిన శామ్యూల్ సుదీప్, జీవీరత్నం, కోశాధికారి ప్రేమరాజు, మధుకిరణ్, దేవదాస్, నవజీవనరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక దర్గాపేటలో క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో క్రైస్తవ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

క్రిస్టియన్ డే బైక్ ర్యాలీ

సామర్లకోట: ఇండియన్ క్రిస్టియన్ డే సందర్భంగా బ్రౌన్‌పేట బెరాకా ప్రార్థన మందిరం నుంచి పోలీసు రింగ్ సెంటర్ వరకూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరకులు, దుప్పట్లు అందజేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్రీస్తు శిష్యులలో ఒకరైన తోమ మొదటి శతాబ్దంలో భారతదేశానికి వచ్చి సువార్తను ప్రకటించిన జులై 3వ తేదీని ఇండియన్ క్రిస్టియన్ డేగా జరుపుకుంటున్నట్లు ఏబీసీసీ అధ్యక్షుడు జాన్ తెలిపారు. కార్యక్రమంలో ఏబీసీసీ కార్యవర్గ సభ్యులు ఆర్.లాజరస్, రమ్య జేమ్స్, జాన్ జ్యోతి కుమార్, కె.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలంటూ ఫిర్యాదులు

డివిజన్ స్థాయి స్పందనకు 20 అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రాకార్‌జైన్, పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: వారం వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన స్పందనకు అర్జీదారులు పోటెత్తారు. ప్రతి వారం 15 దాటని అర్జీలు ఈ వారం 20కి పైగా వచ్చాయి. ట్రైనీ కలెక్టర్ ప్రాకార్ జైన్‌తో కలిసి ఆర్డీఓ జేఎస్ రామారావు గ్రీవెన్స్ నిర్వహించారు. పట్టణంలోని దర్గా సెంటర్‌లో మున్సిపల్ స్థలం ఆక్రమించి బస్‌షెల్టర్ కూల్చేశారని, అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి దుకాణాలను రూ.24 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఒక అర్జీదారుడు ఫిర్యాదుచేశాడు. దివిలి పంచాయతీ పరిధిలో సుబ్బారాయుడుపేటకు వెళ్లే రహదారిలో జరుగుతున్న ఆక్రమణలు తొలగించాలని మరో వినతి వచ్చింది. పెద్దాపురంలో పట్టణంలో ఆశీదారులు గెజిట్‌లో రూ.7 ఉంటే రూ.50 అక్రమంగా వసూలు చేస్తున్నారని మరో అర్జీదారుడు ఫిర్యాదు చేశారు. స్పందన అనంతరం ట్రైనీ కలెక్టర్ ప్రాకార్‌జైన్‌తో కలిసి ఆర్డీఓ జేఎస్ రామారావు విలేకర్లతో మాట్లాడారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ బాలామణి, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేని లాకుల పరిశీలన

పిఠాపురం: గోకివాడలో పుట్టా కొండయ్య కాలువపై అనుమతి లేకుండా నిర్మించిన లాకులను జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయకుమార్ సోమవారం పరిశీలించారు. ఇటీవల పలు గ్రామాలకు చెందిన రైతులు గోకివాడలో అనధికారికంగా లాకుల ఎత్తు పెంచడంతో తమ పొలాలకు సాగునీరందడం లేదని ఆందోళన చేశారు. లాకులను పరిశీలించి వివరాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన కాలువపై నిర్మించిన లాకులను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ



ప్రత్యేక అలంకరణలో సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా



వేట్లపాలెం సాయిబాబా ఆలయంలో పూజలు చేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: గురుపూర్ణిమ సందర్భంగా సోమవారం షిరిడీ సాయి ఆలయాలకు భక్తులు పోటెత్తి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం మేలుకొలుపు హారతి, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపూర్ణిమను పురస్కరించుకుని స్థానిక రైల్వే కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు దన్నాల అప్పారావులు ప్రారంభించారు. ఆలయ కమిటీ కార్యదర్శి గండ్రోతుల సత్యనారాయణ, కోశాధికారి డి.రాజబాబు, సేపెని సూరిబాబు, కొప్పన రాంబాబు తదితరులు భక్తులకు సేవలందించారు. పిఠాపురం రోడ్డులోని సాయిబాబా ఆలయంలోను గురుపూర్ణిమ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

బాబాను దర్శించుకున్న దొరబాబు

సామర్లకోట: గురుపూర్ణిమను పురస్కరించుకుని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సోమవారం వేట్లపాలెంలోని సాయిబాబా ఆలయంలో బాబాను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని దొరబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, సాయిబాబా ఆలయాలు, ఉప్పాడలో వేంకటేశ్వర స్వామి, ఐశ్వర్యసాయి, సాయిబాబా, కొమరగిరిలో సాయిబాబా, వేణుగోపాల స్వామి, గోర్సలో పురాతన సీతారామ లక్ష్మణ ఆలయం, రమణక్కపేట విజయ జనార్దనస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు.

దత్తాత్రేయుడికి లక్ష గులాబీ అర్చన



ఆధ్యాత్మిక సభలో మాట్లాడుతున్న ఉమర్ ఆలీషా

పిఠాపురం: స్థానికంగా పలు దత్త క్షేత్రాల్లో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామివారికి లక్ష తులసి, గులాబీ అర్చనలు జరిగాయి. దత్త బృందావనంలో విశేష అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవదాయ శాఖ డీసీ ఎం.సురేష్ బాబు, కాకినాడ ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, మహారాష్ట్ర ఎంపీ తదితర ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానానికి భక్తులు పోటెత్తారు. పిఠాపురం శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా గురు పౌర్ణమి సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. మానవుని జీవన తత్వానికి గురువు దిక్సూచి అని అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వాన కురిసె.. మది మురిసె



కొత్తపల్లిలో మేఘావృతమైన ఆకాశం

కొత్తపల్లి: హమ్మయ్యా కాస్త చల్లబడింది.. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది.. మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భానుడు సెగలు రేపాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షానికి పలు గ్రామాల్లోని పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో వర్షం నీరు వెళ్లే వీలులేక చెరువులా మారింది. కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో సేదదీరారు.

ఊరటనిచ్చిన వర్షం

సామర్లకోట: ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు సోమవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షం కాసింత ఊరటనిచ్చింది. ఈ ఏడాది వేసవి ముగిసినా, జులై నెలలోకి ప్రవేశించినా భానుడు భగ్గుమంటుండడంతో ప్రజలు మధ్యాహ్నం సమయంలో బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. వరుణుడి రాక కోసం ఎప్పుడెప్పుడా ఎదురుచూస్తున్న తరుణంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం పడడంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు.

ఘనంగా చండీ హోమం



మరిడమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దాపురం: ఆషాఢ మాసం గురు పౌర్ణమి సందర్భంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు చిట్టెం హరి గోపాలశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా 700 శ్లోకాలతో అభిషేకాలు, కుంకుమ పూజ, పుష్ప పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

6న ఉడిపి స్వామీజీ రాక

బోట్‌క్లబ్: భారత్ పరిక్రమ యాత్రలో భాగంగా జగత్ గురు మధ్వాచార్య మూల సంస్థాన ఉడిపి పుత్తిగ మఠ స్వామీజీ సుగుణేంద్ర తీర్థ 6న కాకినాడ నగరానికి వస్తున్నట్లు రాఘవేంద్ర స్వామి బృందావన సమితి ప్రతినిధి వెంకటేష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల పాటు నగరంలో స్వామి ఉంటారన్నారు. 6న సాయంత్రం 5 గంటలకు నగరానికి చేరుకునే స్వామీజీకి ఘనంగా స్వాగతం పలుకుతామన్నారు. 7న పీఠపూజ జరుగుతుందన్నారు.

ఐదుగురు నిందితుల అరెస్ట్

కరప: వేళంగి వద్ద ఐదుగురు కోళ్ల దొంగలను కరప పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం .. వేములవాడకు చెందిన కాళ్ల వెంకట మహేశ్వరరావు కోళ్ల ఫారం నుంచి మే 21న 29 కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అదే నెలలో 30న వేళంగిలోని పోతూరి సూర్యప్రకాష్‌కు చెందిన ఎనిమిది కోళ్లు అపహరణకు గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ కేసులు నమోదు చేశారు. సోమవారం వేళంగి సమీపంలో ఎస్ఐ తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా ఐదుగురు అనుమానాస్పదంగా పట్టుబడ్డారు. వారిని విచారించగా పై రెండు చోరీల గుట్టు వీడింది. నిందితుల్లో కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన పెమ్మిరెడ్డి బాలవెంకట్, కె.గంగవరానికి చెందిన కర్రి సత్యనారాయణ, కోటిపల్లికి చెందిన డొక్కాడి ఈశ్వర్‌ప్రసాద్, పెదతాళ్లపాలేనికి చెందిన పంపన దుర్గాప్రసాద్, చొల్లంగిపేటకు చెందిన 16 ఏళ్ల బాలుడు ఉన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు కిటకిటలాడారు. స్వామికి ప్రీతిపాత్రమైన గురుపూర్ణిమ కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలి పూజ చేశారు. తరువాత భక్తుల అభిషేకాలను స్వామి వారికి చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరఫున అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వర రావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవాదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజల అనంతరం మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.